ప్రజల చేతుల్లో.. హోటల్స్ రేటింగ్

రెస్టారెంట్ల యాజమాన్యాలకు జవాబుదారీతనం పెరగాలి

పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు కమిటీ

ఇటీవల తనిఖీల్లో సమస్యలు గుర్తింపు

హైదరాబాద్ రెస్టారెంట్స్‌కు రేటింగ్ ఇవ్వాలని నిర్ణయం

ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసిన ఎన్ఆర్ఏఐ



సిటీబ్యూరో, మే 31 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మహానగరంలో ఉన్న రెస్టారెంట్స్‌కు పరిశుభ్రతలో రేటింగ్స్ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. నగరంలో ఇటీవల కాలంలో పలు రెస్టారెంట్లపై నిర్వహించిన దాడుల నేపథ్యంలో నేషనల్ రెస్టారెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఆర్ఏఐ)ఈ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని రెస్టారెంట్లకు హైజీన్ రేటింగ్స్ ఇవ్వాలని, తద్వారా జవాబుదారీతనం పెంచడానికి ఈ చొరవ దోహదం చేస్తుందని ఎన్ఆర్ఏఐ ప్రతినిధి తెలిపారు. ఎన్ఆర్ఏఐ హైదరాబాద్ చాప్టర్ హెడ్ సంపత్ తుమ్మల అధ్యక్షతన 15 మంది సభ్యులతో కూడిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఇది నగరం అంతటా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రమాణాల అమలును నిర్ధారిస్తుంది. హోటళ్లు, రెస్టారెంట్లలో పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు త్వరలో ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చాప్టర్ ప్రతినిధి తెలిపారు. ఎన్ఆర్ఏఐ టాస్క్‌ఫోర్స్ బృందం వర్క్‌షాపులు, శిక్షణ కార్యక్రమాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి పరిశుభ్రతపై నిర్వాహకులకు అవగాహన కల్పిస్తుంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆహార భద్రతా విభాగం టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీల సమయంలో వివిధ రెస్టారెంట్లలో పరిశుభ్రత విషయంలో చాలా సమస్యలను గుర్తించిన నేపథ్యంలోనే ఈ కార్యక్రమాలను ఎన్ఆర్ఏఐ చేపట్టిందని తెలిపారు.

టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వినోద్ ఎన్నిక

నేరేడ్‌మెట్, మే 31 : తెలంగాణ రాష్ట్ర ఎంప్లాయీస్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పీఎస్ వినోద్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా ఎంఏ.డేవిడ్ ఫ్రాన్సిస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం మలక్‌పేట వైశ్యసంఘం పంక్షన్‌హాల్‌లో రిటర్నింగ్ అధికారిగా మహేందర్ రెడ్డి, పి.రవికుమార్ పర్యవేక్షణలో రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. ప్రధాన కార్యదర్శిగా వెంకటయ్య, కోశాధికారిగా నరసింహ ఎన్నికయ్యారు.

ఆనంద లహరి సంపుటి ఆవిష్కరణ

తెలుగు యూనివర్సిటీ, మే 31 :బాలసాహిత్యం పిల్లలకు వినోదం, విజ్ఞానాన్ని పెంపొందిస్తుందని తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన మండలి సంచాలకులు ఎం.రాధా రెడ్డి అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు నిర్వహించిన బాలసాహిత్య సమ్మేళనంలో ప్రముఖ రచయిత సుతారపు వెంకటనారాయణ రచించిన ఆనంద లహరి గేయాల కవితా సంపుటిని రాధారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య పాల్గొన్నారు.

6న చండీఘర్‌లో.. టీ హబ్ ఇండియా ఇన్నోవేషన్ యాత్ర

సిటీబ్యూరో, మే 31 (నమస్తే తెలంగాణ) : సరికొత్త ఆవిష్కరణలను, స్టార్టప్‌లను ప్రోత్సహించడమే లక్ష్యంగా టీ హబ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నది. తాజాగా ఇండియా స్టార్టప్ సాహస యాత్రను దేశంలోని 11 నగరాల్లో నిర్వహించేందుకు ప్రణాళికను సిద్ధం చేసింది. ఇందులో భాగంగా జూన్ 6వ తేదీన చండీఘర్‌లో ఇండియా ఇన్నోవేషన్ యాత్రను నిర్వహించనున్నారు. ఇప్పటికే కోయంబత్తూరు, మంగళూరు నగరాల్లో నిర్వహించారు. దశలవారీగా దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లోనూ నిర్వహించేలా ప్రణాళికను సిద్ధం చేశామని టీహబ్ సీఈఓ ఎం.ఎస్.రావు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా దేశ వ్యాప్తంగా ఉన్న ఔత్సాహిక అంత్రపెన్యూర్స్ నూతన ఆవిష్కరణలు చేయడంలో ప్రోత్సహించేందుకు టీహబ్ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు.

నెల రోజుల పాప కిడ్నాప్

బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు

నిందితుల అరెస్టు, రిమాండ్

శంషాబాద్ రూరల్, మే 31: నెల రోజుల వయసున్న పాపను కిడ్నాప్ చేసి, విక్రయించేందుకు యత్నించిన ముగ్గురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు శంషాబాద్ జోన్ డీసీపీ నారాయణరెడ్డి తెలిపారు. చిన్నారిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించినట్టు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ నారాయణరెడ్డి వివరాలను వెల్లడించారు. కర్నూల్ జిల్లా డోన్ ప్రాంతానికి చెందిన లక్ష్మి, చిన్న దంపతులు. వీరి బతుకుదేరువు కోసం శంషాబాద్‌కు వచ్చి ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఉంటూ.. చిత్తు కాగితాలు ఏరుకొని వాటిని విక్రయించగా వచ్చిన డబ్బుతో జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 27న రాత్రి బ్రిడ్జి కింద నెల రోజుల వయసున్న పాపతో కలిసి తల్లితండ్రి ఇద్దరు నిద్ర పోయారు. ఇది గమనించిన ముగ్గురు దండుగులు పాపను కిడ్నాప్ చేసి తీసుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు రంగంలోకి దిగి మిస్టరిని ఛేదించారు. మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతానికి చెందిన దండు హన్మంతురావు, అతడి భార్య దండు చందన, దగ్గరి బంధువు స్వాతి కలిసి పాపను కిడ్నాప్ చేశారు. ఆ పాపను విక్రయించి సొమ్ము చేసుకోవాలని పథకం వేశారు. నిందితులను అరెస్టు చేసి, పాపను తల్లికి అప్పగించినట్లు డీసీపీ వివరించారు. కేసుకు ఛేదించిన పోలీసులను డీసీపీ అభినందించారు. సమావేశంలో అదనపు డీసీపీ రాంకుమార్, ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐ బాలరాజు, ఎస్ఐలు మణ్యం పాల్గొన్నారు.

స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తేవాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

చిక్కడపల్లి, మే 31 : రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేటర్ విద్యాసంస్థల్లో ఫీజుల దందా నియంత్రణ కోసం ప్రత్యేక చట్టం తెవాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనే ఈ చట్టానికి రూపకల్పన చేయాలని కోరారు. భారత విద్యార్థి ఫెడరేషన్(ఎఫ్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో 'ఫీజుల నియంత్రణ చట్టం– అవశ్యకత' అనే అంశంపై శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎ.నర్సిరెడ్డి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ కోసం వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చట్టం ప్రవేశ పెట్టి ఫీజుల నియంత్రణ చేయాలన్నారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ విద్యలో వ్యాపార ధోరణి ప్రమాదకరమన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎ.మూర్తి అధ్యక్షతన వహించిన ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, ప్రొఫెసర్ తిరుపతిరావు, ఐఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు పి.నాగరాజు, పుట్టా లక్ష్మణ్, మణికంఠ రెడ్డి, రామకృష్ణ, అశోక్ రెడ్డి, పాల్గొన్నారు.

ముగిసిన కస్టడీ

ఉమామహేశ్వర్‌రావును మరో మూడు రోజుల కస్టడీకి ఇవ్వాలని పిటీషన్

నాంపల్లి కోర్టులు, మే 31 (నమస్తే తెలంగాణ) :ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో మూడు రోజుల కస్టడీ పూర్తికావడంతో ఏసీపీ టి.శ్రీరామ ఉమామహేశ్వరరావును శుక్రవారం ఏసీబీ కోర్టు ఎదుట అధికారులు హాజరుపర్చారు. ఉస్మానియా ఆసుపత్రితో వైద్యపరీక్షలు నిర్వహించిన తర్వాత నేరుగా ఏసీబీ కోర్టుకు తీసుకువచ్చారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తూ ఆదేశాలు జారీ చేయగా.. చంచల్‌గూడ జైలుకు తరలించారు. మరో మూడు రోజుల కస్టడీకి అప్పగించాలని శుక్రవారం ఏసీబీ అధికారులు పిటీషన్ దాఖలు చేశారు. బినామీ ఆస్తుల వివరాలను వెల్లడించేందుకు నిందితుడు సహకరించలేదని పేర్కొన్నారు. తన కుటుంబ సభ్యులతో పాటు బినామీల పేరిట చాలా ఆస్తులను కొనుగోలు చేసిన డాక్యుమెంట్ల వివరాలను తెలుసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. స్థిర, చరాస్తులకు చెందిన వివరాలను సేకరించేందుకు మరింత సమయం కావాలని., నిందితుడి నుంచి మరింత కీలక సమాచారాన్ని, పత్రాలను జప్తు చేయాల్సి ఉందన్నారు. ఆశోక్‌నగర్‌లోని తన ఇంటిలో జరిపిన సోదాల్లో లభించిన ఆధారాలకు చెందిన వివరాలను సైతం వెల్లడించేందుకు నిందితుడు నిరాకరించాడని, అందుకోసం మరింత సమయం కావాలని కోర్టును కోరారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచండి

వినతి పత్రం అందజేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

సిటీబ్యూరో, మే 31 (నమస్తే తెలంగాణ) :జలమండలి రెవెన్యూ విభాగంలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీవో నంబరు 60 కేటగిరి–2 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరుతూ జలమండలి కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నారాయణ శుక్రవారం జలమండలి డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్‌కుమార్ కలిసి కోరారు. కేటగిరి–1 ప్రకారం ఇవ్వడంతో వేతనాలు తక్కువగా పొందుతున్నారని చెప్పారు. రెగ్యూలర్ వేతనాలతో పాటు వర్షాకాలంలో రెయిన్ కోట్లు ఇవ్వాలని కోరారు. సానుకూలంగా స్పందించిన రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్‌కుమార్ వెంటనే పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కిరణ్‌కుమార్, మీటర్ రీడర్స్ నాయకులు బాలకృష్ణరెడ్డి, రాములు, వెంకటేశ్, శ్రీకాంత్, నరేశ్, సురేశ్, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

జలమండలి ప్రాజెక్టు డైరెక్టర్ పదవీ విరమణ

సిటీబ్యూరో, మే 31 (నమస్తే తెలంగాణ) : పదవీ విరమణ అనేది జీవితంలో ఒక భాగమని, ఉద్యోగ సమయంలో మనం ఏం చేశామో గుర్తు చేసుకోవడానికి, భవిష్యత్తులో ఏం చేయాలో నిర్ణయించుకునే రోజు అని జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి అన్నారు. జలమండలి ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌బాబు శుక్రవారం పదవీ విమరణ సందర్భంగా జలమండలి ఇంజినీర్స్ అసోసియేషన్ సభ్యులు ఖైరతాబాద్ సంస్థ ప్రధాన కార్యాలయంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎండీ సుదర్శన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఇంజినీర్‌గా, డైరెక్టర్‌గా శ్రీధర్‌బాబు జలమండలికి అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు అజ్మీరా కృష్ణ, వీఎల్ ప్రవీణ్‌కుమార్, రవి కుమార్, స్వామి, జేఈఏ ప్రతినిధులు, ఇతర ఉద్యోగులు శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

గిరిజన రిజర్వేషన్లు తగ్గిస్తే ఊరుకోం

సమావేశంలో మాట్లాడుతున్న రాంచందర్ నాయక్

ఖైరతాబాద్, మే 31 : రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన గిరిజనుల రిజర్వేషన్లను తగ్గిస్తే ఊరుకునేది లేదని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ రాంచందర్ నాయక్ అన్నారు. ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని గిరిజన విద్యుత్ భవన్‌లో జరిగిన ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో రాంచందర్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో జీవో నం.33 ప్రకారం గిరిజన జనాభా ప్రాతిపదికన విద్యా, ఉద్యోగాల్లో పది శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని తెలిపారు. కొందరు పది శాతం రిజర్వేషన్లను విచ్ఛిన్నం చేయడానికి కుట్రలు చేస్తున్నారని చెప్పారు. రిజర్వేషన్లు తగ్గించాలని చూస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అసోసియేట్ అధ్యక్షుడు ఆర్.మోహన్ సింగ్, ప్రధాన కార్యదర్శి నారాయణ నాయక్, ఉపాధ్యక్షులు శివాజీ రాథోడ్, తేజావత్ జోగారాం, గోపీచంద్, కిషన్ నాయక్, ధనుంజయ, ప్రవీణ్ నాయక్, హరిసింగ్, విష్ణు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యుడిని కత్తితో బెదిరించిన దొంగ

జైలుపాలు చేశారని కక్షగట్టిన నేరస్తుడు

నా ప్రాణాలకు రక్షణ కల్పించండి

పోలీసులకు ఆయుర్వేద వైద్యుడి వేడుకోలు

వెంగళరావునగర్, మే 31: తన క్లినిక్‌లో చోరీ చేసిన దొంగను పోలీసులకు పట్టించడమే ఆ ఆయుర్వేద వైద్యుడికి శాపంగా మారింది. జైలు నుంచి తిరిగొచ్చిన దొంగ కత్తితో బెదిరింపులకు పాల్పడుతుండటంతో ఆ వైద్యుడు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి దాపురించింది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. బోరబండకు చెందిన గోగుల మునిరాజు ఆయుర్వేద వైద్యుడు. అతడికి ఎల్లారెడ్డిగూడలోని అంబేద్కర్‌నగర్ కీర్తి అపార్టుమెంట్స్ సమీపంలో క్లినిక్ ఉంది. 6 నెలల కిందట క్లినిక్‌లో ఎవరూ లేని సమయంలో తలుపులు పగుగొట్టి రూ.45 వేలు చోరీ జరిగింది. క్లినిక్ పక్కింట్లో ఉండే డబ్బు సుధాకర్ ఈ చోరీకి పాల్పడినట్లు దర్యాప్తులో తేలడంతో పోలీసులు అతడిని అరెస్టు చేసి జైలుకు పంపారు. సుధాకర్ జైలు నుంచి బయటకు వచ్చాడు. సుధాకర్ ఇటీవల తనను జైలు పాలు చేసిన డాక్టర్‌ను చంపేస్తానంటూ క్లినిక్ వద్ద తిరుగుతూ దుర్భాషలాడుతూ కత్తితో బెదిరింపులకు గురి చేస్తున్నాడు. డాక్టర్ కారు అద్దాలు, టైర్లను ధ్వంసం చేశాడు. సుధుకార్ నుంచి తనకు ప్రాణాలకు హాని ఉన్నదని, తనకు రక్షణ కల్పించాలని మధురానగర్ పోలీసులకు కోరారు. డాక్టర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన సాట్స్ శిక్షణ శిబిరాలు

హైదరాబాద్ ఆట ప్రతినిధి, మే 31 : రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(సాట్స్) ఆధ్వర్యంలో జరిగిన వేసవి శిక్షణా శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. ఏప్రిల్ 15 నుంచి మే 31 తేదీ వరకు జంట నగరాల్లోని ఆరు స్టేడియాలతో పాటు 32 జిల్లా కేంద్రాల్లో శిబిరాలు విజయవంతంగా జరిగాయి. సాట్స్ క్రీడా శిబిరాల ముగింపు ఉత్సవాలను అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లేయర్లకు సర్టిఫికెట్స్‌తో పాటు విజేతలకు పతకాలు అందజేశారు. ఎల్బీస్టేడియంలో జరిగిన కార్యక్రమానికి సాట్స్ ఉప సంచాలకులు శ్రీలత, ధనలక్ష్మి, చంద్రారెడ్డి, కల్యాణి తదితరులు హాజరయ్యారు.

థాయిలాండ్‌లో సత్తాచాటిన హైదరాబాద్ ప్లేయర్

హైదరాబాద్ ఆట ప్రతినిధి, మే 31 : థాయిలాండ్ వేదికగా జరిగిన అంతర్జాతీయ టెన్నిస్ ఫెడరేషన్ మాస్టర్స్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ వెంకట నారాయణ మూర్తి సత్తాచాటాడు. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్‌లో నారాయణ, మార్షియల్ రికెమ్ బుష్ జోడీ 6–2, 6–1తో వాంగ్, రామదాస్ బాలన్ ద్వయంపై అలవోక విజయం సాధించి టైటిల్ కైవసం చేసుకుంది.

ప్రపంచ రికార్డు సాధించిన చిన్నారి

సిటీబ్యూరో, మే 31 (నమస్తే తెలంగాణ) : చెక్‌మేట్–ఇన్–వన్–మూవ్ పజిల్స్‌ను అతి తక్కువ సమయంలో పరిష్కరించిన ఐదేండ్ల చిన్నారి ప్రపంచ రికార్డును సొంతం చేసుకుంది. మైహోమ్ అభ్రా అపార్ట్‌మెంట్స్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించిన ఈ పోటీల్లో చెస్ ప్రాడిజీ ఇషాని చక్కిలం కేవలం 9.23ని మిషాల్లో 104 చెక్‌మేట్–ఇన్–వన్–మూవ్ పజిల్స్‌ను పరిష్కరించి రికార్డు సృష్టించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి కొండా సురేఖ, బ్రిటీశ్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్‌లు చిన్నారిని అభినందించారు.

ధర్నాలో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ లక్ష్మణ్

ప్రజల దృష్టిని మళ్లించేందుకే.. రేవంత్ కుట్రలు

రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్

కవాడిగూడ, మే 31 : ప్రజల దృష్టిని మళ్లించేందుకే సీఎం రేవంత్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో బీజేపీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన హామీలను మరిచిందని అన్నారు. ప్రజల దృష్టిని మరల్చేందుకు రేవంత్ రెడ్డి చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కాచం వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్, బూర నర్సయ్య, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు పొంగులేటి సుధాకర్ రెడ్డి, రాంచందర్ రావు, మాజీ మంత్రులు కృష్ణ యాదవ్, ఇనుగాల పెద్దిరెడ్డి, కవాడిగూడ కార్పొరేటర్ గోడ్చల రచనశ్రీ, నాయకులు ఎం.రమేశ్ రామ్, జి.వెంకటేశ్, సలంద్రి శ్రీనివాస్ యాదవ్, ఎంసీ మహేందర్ బాబు, ఎ.వినయ్ కుమార్, బద్రినారాయణ, నిత్యానంద్, నందగిరి నర్సింహ, మహిళా నాయకురాలు శిల్ప, తదితరులు పాల్గొన్నారు.

పనుల్లోకి జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్లు

కమిషనర్ హామీతో సమ్మె విరమించినట్లు అసోసియేషన్ వెల్లడి

సిటీబ్యూరో, మే 31, (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ, కాంట్రాక్టర్ల మధ్య నెలకొన్న వివాదం ఎట్టకేలకు ముగిసింది. పెండింగ్ పనులు చెల్లించే వరకు పనులు చేపట్టబోమని జీహెచ్ఎంసీకి అల్టిమేటం జారీ చేసిన కాంట్రాక్టర్ల అసోసియేషన్ మే 18వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లారు. జీహెచ్ఎంసీ ఆరు జోన్ల పరిధిలో మొత్తం కాంట్రాక్టర్లు పనులను ఎక్కడికక్కడ నిలిపివేసి బంద్ పాటించారు. కమిషనర్ సైతం వారిని చర్చల్లోకి పిలవక పోవడంతో అత్యవసర పనులను నిలిపివేస్తామని, మాన్‌సూన్ పనుల టెండర్లలో పాల్గొనబోమని హెచ్చరించారు. దీంతో దాదాపు 12 రోజుల తర్వాత అసోసియేషన్‌ను చర్చలకు ఆహ్వానించిన జీహెచ్ఎంసీ ఈఎన్సీ జియావుద్దీన్ విడతల వారీగా పెండింగ్ బకాయిలను చెల్లిస్తామని ప్రతిపాదనలు పెట్టగా.. అసోసియేషన్ నేతలు కమిషనర్‌తో హామీ ఇప్పించాలని కోరారు. దీంతో అసోసియేషన్ నేతలు కమిషనర్ రొనాల్డ్ రాస్‌తో సమావేశమయ్యారు. జూన్, జూలై, ఆగస్టు నెలకు సంబంధించి రూ.300కోట్లు చెల్లిస్తామని, సెప్టెంబరు నుంచి డిసెంబర్ వరకు బిల్లులను బ్యాంకు రుణాల ద్వారా సర్దుబాటు చేస్తామని కమిషనర్ చెప్పారు. దీంతో సమ్మె విరమించి పనుల్లోకి చేరుతున్నట్లు తెలిపారు. అత్యవసర పనులకు సంబంధించి టెండర్లలో పాల్గొంటామని అసోసియేషన్ ప్రెసిడెంట్ రామకృష్ణారెడ్డి తెలిపారు.

సమాజ వికాసానికి పుస్తకాలు దోహదం

హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో జరిగిన సభలో మాట్లాడుతున్న మణికొండ వేదకుమార్

హిమాయత్‌నగర్, మే 31 : సమాజ వికాసానికి పుస్తకాలు ఎంతో దోహదపడతాయని ప్రముఖ విద్యావేత్త మణికొండ వేదకుమార్, సాహితీవేత్త వాడ్రేవ్ చిన వీరభద్రుడు, హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు కవి యాకూబ్ అన్నారు. ఈ నెల 26న నర్సంపేట నుంచి ప్రారంభమైన గ్రంథాలయ ఉద్యమ యాత్ర ముగింపు సభ శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాతృ భాషపై అభిమానం పెంచడం, పాఠశాలలో విద్యా వికాసం, విద్యార్థులలో నైతిక విలువలను పెంచి ఆత్మ విశ్వాసాన్నిచ్చేది పుస్తకమేనన్నారు. చిన్ననాటి నుంచి పిల్లల్లో మానవ సంబంధాలు, సమాజంపై మక్కువ పెంచేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కీలకపాత్ర వహించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ మురళీకృష్ణ, గ్రంథాలయ ఉద్యమ కమిటీ కన్వీనర్ కాసుల రవికుమార్, బాలసాహితీవేత్త గరిపల్లి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా నాగపూర్ణ

నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

మణికొండ, మే 31 : నార్సింగి మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకున్నది. జిల్లా కలెక్టర్ శాశంక ఆదేశాల మేరకు శుక్రవారం రిటర్నింగ్ అధికారి, రాజేంద్ర నగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి సమక్షంలో మున్సిపాలిటీ నూతన చైర్‌పర్సన్‌గా మంచిరేవుల 10వ వార్డు కౌన్సిలర్ మైలారం నాగపూర్ణ, వైస్ చైర్మన్‌గా కోకాపేట గ్రామ 3వ వార్డు కౌన్సిలర్ గోపాల విజయబాబు ఎన్నికయ్యారు.

ఎంఎన్‌జేలో అన్నదానం

సుల్తాన్‌బజార్, మే 31 : ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖానలో అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 500 మందికి శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ, అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, సభ్యులు మహమ్మద్ అబ్దుల్ ముజీబ్, వైదిక్ శస్త్ర, బి.శంకర్, ముఖీం ఖురేషి, ఏపీఆర్‌వో అబ్దుల్ వహీద్, ముస్తఫా షరీఫ్, హబీబ్ చావూష్, అబ్దుల్ ముస్తఫా, ఎంఎన్‌జే దవాఖాన యూనిట్ సభ్యులు శివకుమార్, చంద్రశేఖర్, మిత్రులు సయ్యత్ జమాల్ జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.